

స్మార్ట్ ప'రేషన్' 8లో




ప్రాణాలకు తెగించైనా బల్క్ డ్రగ్‌ను అడ్డుకుంటాం 8లో



ఎయిర్ పోర్టులో ఘనంగా యాత్రి సేవా దివాస్ 8లో

బిగ్ రిలీఫ్



నగర వాసులకు బొనాంజా అందనుంది. దసరా, దీపావళి పండగ ఆనందాలు రెట్టింపు కానున్నాయి. ఇటీవల కేంద్రం సవరించిన వస్తు సేవల పన్ను(జీఎస్టీ) శ్లాబులు ఈ నెల 22వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. గృహోపకరణాలు, ఆటో మొబైల్స్, ఎలక్ట్రానిక్ వంటి చాలా వరకు ఉత్పత్తుల ధరలు 10 శాతం మేర తగ్గనున్నాయి. గృహ నిర్మాణ భారం నుంచి ఉపశమనం కలగనుంది. దీంతో వాహనాలు, కార్లు, టీవీలు, సెల్‌ఫోన్లు వంటి ఉత్పత్తుల కొనుగోలుదారులు ఈనెల 22 వరకు వాయిదా వేసుకుంటున్నారు. ఈ కామర్స్ సంస్థలు సైతం ఈనెల 22 తర్వాతే ఆఫర్లు అందించేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లు, ఆన్‌లైన్ సంస్థల్లో అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. – విశాఖ సిటీ

తగ్గనున్న నిత్యావసర ధరలు



ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉప్పు నుంచి పప్పు వరకు రేట్లు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో జీఎస్టీ సవరణలతో మరో వారం రోజుల్లో ఈ ధరలు దిగిరానున్నాయి. సాధారణ ప్రజలు నిత్యం వినియోగించే వస్తువులపై కేవలం 5 శాతం మాత్రమే జీఎస్టీ విధించారు. దీంతో పేస్ట్ నుంచి డ్రై ఫ్రూట్స్ వరకు ధరలు తగ్గనున్నాయి. వీటితో పాటు పన్నీర్, బ్రెడ్, వెన్న, నెయ్యి, పాస్తా, నూడుల్స్, కార్న్‌ఫ్లేక్స్, బిస్కెట్లు, కేకులు, స్వీట్లు వంటి ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ధరలు అందుబాటులోకి రానున్నాయి. ఖరీదైన బాదం, జీడిపప్పు, పిస్తా, ఖర్జూరం వంటి వాటిపై కూడా జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గనుంది. ఇది సాధారణ ప్రజలకు భారీ ఉపశమనాన్ని అందించనుంది.

గృహ నిర్మాణ భారం నుంచి ఉపశమనం



జీఎస్టీ సంస్కరణలతో రియల్ ఎస్టేట్ రంగానికి మంచి రోజులు కనిపిస్తున్నాయి. బిల్డర్లతో పాటు సొంతింటి నిర్మాణాలు చేపట్టే ప్రజలకు నిర్మాణ వ్యయం భారీగా తగ్గనుంది. దీంతో ఫ్లాట్లు, ఇళ్ల ధరలు తగ్గనున్నాయి. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు, గ్రానైట్, మార్బుల్స్, టైల్స్, రంగుల ధరలపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. సాధారణంగా ఇంటి నిర్మాణంలో అయ్యే ఖర్చులో 40–45 శాతం వ్యయం నిర్మాణ సామగ్రిదే ఉంటుంది. తాజా జీఎస్టీ సవరణతో నిర్మాణ సామగ్రిపై అయ్యే ఖర్చులో డెవలపర్‌కు 10–15 శాతం వరకు ఆదా అవుతుంది. ఫలితంగా మొత్తం ఇంటి నిర్మాణ వ్యయం 4–6 శాతం వరకు తగ్గుతుంది.

ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు సైతం..



జీఎస్టీ సవరణతో ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు కూడా భారీగా తగ్గనున్నాయి. ఇప్పటి కంటే 10 నుంచి 13 శాతం మేర ధరలు దిగివచ్చే అవకాశాలు ఉన్నాయి. టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు ఇలా అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువుల ధరల్లో వ్యత్యాసం భారీగా ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు కూడా అందుబాటు ధరల్లోకి రానున్నాయి. టీవీలపై రూ.5 వేలు నుంచి రూ.15 వేలు వరకు, మొబైల్ ఫోన్లపై రూ.2 వేలు నుంచి రూ.5 వేలు, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్లపై రూ.7 వేలు నుంచి రూ.10 వేలు వరకు తగ్గింపు ఉండే అవకాశం ఉంది. సాధారణంగా దసరా, దీపావళి సమయాల్లో ఎలక్ట్రానిక్, వస్తువులపై వ్యాపారులు ప్రత్యేక డిస్కౌంట్లు, బహుమతులు ఇస్తుంటారు. ఈ ఏడాది మాత్రం వ్యాపారుల ఆఫర్లతో పాటు కేంద్రం జీఎస్టీ రూపంలో కొనుగోలుదారులకు శుభవార్త చెప్పింది. దీంతో ప్రజలు ఈ నెల 22వ తేదీ తర్వాతే గృహోపకరణాలు, మొబైల్స్‌ను కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు.

వాహనాలపై 28 నుంచి 18 శాతానికి..



వాహనాల ధరలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి కేంద్రం కుదించింది. దీంతో వీటి ధరలు తగ్గనున్నాయి. సాధారణంగా దసరా, దీపావళి పండగ సీజన్లలో వాహనాలను కొనుగోలు చేయడం సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. ఈ నెల 22వ తేదీ నుంచి బైక్‌లు, కార్లపై 10 శాతం వరకు ధరలు తగ్గనుండడంతో భారీగా వాహనకొనుగోళ్లు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బైక్, కార్ల కంపెనీలు తగ్గించిన ధరలను ప్రకటించాయి. బైక్‌లపై రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు, మధ్యస్థాయి కారుపై రూ.1.5 లక్షల వరకు తగ్గింపు ఉండనుంది. దీంతో కొనుగోలుదారులు ఈనెల 22 తర్వాతే వాహనాలను కొనుగోలు చేసేందుకు వాయిదా వేస్తున్నారు. అయితే కొన్ని షోరూమ్‌లు ప్రీ బుకింగ్‌లకు కూడా డిస్కౌంట్ ధరలు ప్రకటించాయి. లగ్జరీ కార్లపై 40శాతం జీఎస్టీ విధించారు. 350 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ ఉన్న బైక్‌లు, ఇతర లగ్జరీ వస్తువులపై ప్రత్యేక, అధిక స్లాబ్ వడ్డించారు.

ఈ-కామర్స్‌లో ఆఫర్ల వెల్లువ



ఈ-కామర్స్ సంస్థల్లో కూడా డిస్కౌంట్ల సందడి మొదలైంది. ఈ నెల 22వ తేదీ నుంచి అమెజాన్ 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్', ఫ్లిప్‌కార్ట్ 'బిగ్ బిలియన్ డేస్' పేర్లతో భారీ సేల్‌కు సిద్ధమవుతున్నాయి. ఇక మింత్రా, మీషో, షాపీ వంటివి ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. జీఎస్టీ సవరణలతో ఈ నెల 22వ తేదీ నుంచి అన్ని రకాల వస్తువులపై డిస్కౌంట్ల వర్షం కురిపించనున్నాయి.

ఏయూ అవుట్ గేట్ నుంచి ఎండలో చంటి పిల్లలను ఎత్తుకొని వెళ్తున్న తల్లులు



ఎండలో కిలోమీటరు నడిపించి..





- వ్యాక్సిన్లు వేస్తామని సీఎం కార్యక్రమానికి తల్లుల తరలింపు
- చంటి పిల్లలతో తల్లులను ఎండలో నడిపించిన అధికారులు

విశాఖ సిటీ: స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో తల్లులకు చుక్కలు చూపించారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలతో పాటు పిల్లలకు వ్యాక్సిన్లు వేస్తామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఈ స్టాళ్లను సందర్శనకు వస్తుండడంతో ఇక్కడకు రోగులతో పాటు వ్యాక్సిన్ల కోసం పిల్లలను తీసుకువచ్చే బాధ్యతలను ఆర్పీలకు అప్పగించారు. దీంతో ఆర్పీలు తమ వార్డుల్లో ఉన్న వారిని ఆటోల్లో సీఎం కార్యక్రమానికి తరలించారు. ఇదిలా ఉంటే.. మధ్యాహ్నం 11.30 గంటలకు కార్యక్రమం జరిగితే ఉదయం 8 గంటలకే వారిని తరలించారు. బీచ్ రోడ్డులో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో స్టాళ్లను ఏర్పాటు చేయగా.. వీరిని కిలోమీటరు దూరంలో ఏయూ అవుట్ గేట్ వద్దే దించేశారు. దీంతో తల్లులు చంటి పిల్లలను ఎత్తుకొని ఎండలో అవస్థలు పడుతూ నడవాల్సి వచ్చింది. వ్యాక్సిన్ కోసం పిలిచి ఇబ్బందులకు గురి చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు దూరం నడవలేక మధ్యలోనే చెట్లు, ఇళ్ల ముందు కూర్చుండిపోయారు.



ఆటోలో తరలింపు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం

మహారాణిపేట: జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి బుధవారం ఉదయం 11.16 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి స్థానిక నేతలు, అధికారులు స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రి ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలోను, రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్‌కు హాజరయ్యారు. అనంతరం రాత్రి 8.55 గంటలకు విమానంలో తిరుగు పయనమయ్యారు.



మాడ్యులర్ ఎంబీఏ కోసం అవగాహన ఒప్పందం



ఎంఓయూ పత్రాలు చూపిస్తున్న డైరెక్టర్లు చంద్రశేఖర్, కృష్ణన్

తగరపువలస: జాతీయ ప్రాధాన్యత గల మాడ్యులర్ ఎంబీఏ కోసం ఐఐఎంవీ, ఐఐఐటీ మణిపూర్‌ల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. గంభీరం ఐఐఎంవీలో బుధవారం ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్, మణిపూర్‌లోని సేనాపతి ఐఐఐటీ డైరెక్టర్ కృష్ణన్‌భాస్కర్‌లు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో దేశంలో ప్రముఖ 18 ఎన్ఐటీ, ఐఐఐటీలకు విశాఖ ఐఐఎం పీజీపీఎంసీఐ సహకారం అందిస్తున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. కేంద్రం నిధులతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల విద్యార్థులు, గ్రాడ్యుయేట్ల కోసం మాడ్యులర్ ఎంబీఏ రూపొందించినట్లు వెల్లడించారు. ఇది బీటెక్, ఎంటెక్ డిగ్రీలతో పాటు అవసరమైన నిర్వహణ పరిజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 30 వరకు అడ్మిషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్ ప్రొఫెసర్ ఎం.షమీమ్ జావేద్, డీన్ మారిశెట్టి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ ఆర్ట్‌తో ప్రధాని మోదీకి శుభాకాంక్షలు



ఏయూ క్యాంపస్: ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరానికి చెందిన మిల్లెట్ ఆర్టిస్ట్ మోకా విజయ్‌కుమార్ వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు. సహజసిద్ధమైన చిరుధాన్యాలతో ఎనిమిది అడుగుల ఎత్తు, ఐదు అడుగుల వెడల్పు కలిగిన ఈ చిత్రాన్ని తీర్చిదిద్దేందుకు దాదాపు నెల రోజుల సమయం పట్టిందని మోకా వెల్లడించారు. మోదీ నిలువెత్తు చిత్రపటం బ్యాక్‌గ్రౌండ్‌లో ఆపరేషన్ సిందూర్, మేక్ ఇన్ ఇండియా, వందే భారత్ రైలు, వ్యవసాయం, నూతన పార్లమెంట్ భవనం, యోగా తదితర ప్రతిష్టాత్మక కార్యక్రమాల చిత్రాలను తీర్చిదిద్దారు. దేశ ప్రధానిగా సేవలందిస్తూ, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తున్న మోదీని అభినందిస్తూ ఈ చిత్రపటాన్ని తీర్చిదిద్దినట్లు చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

కూటమి పాలనలో పేదలకు వైద్యం దూరం

- చలో మెడికల్ కాలేజ్ విజయవంతానికి పిలుపు
- పాడేరు మెడికల్ కళాశాల వద్ద శాంతియుత నిరసన రేపు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్

మహారాణిపేట: రాష్ట్ర ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడటమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉత్తరాంధ్ర జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్ అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఏర్పాటుతో పేదోడికి వైద్య విద్యను చేరువ చేసేందుకు కృషి చేశారని కొనియాడారు. 2019 వరకు రాష్ట్రంలో కేవలం 12 ప్రభుత్వ మెడికల్ కాలేజీలే ఉండగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023 సెప్టెంబర్ 15న విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను ఒకేసారి ప్రారంభించి, ప్రజారోగ్య పరిరక్షణలో కొత్త దశకు వైఎస్ జగన్ నాంది పలికారన్నారు. ఈ ఐదు కాలేజీల్లో 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా.. పాడేరు, పులివెందుల కాలేజీలను కూడా అడ్మిషన్లకు సిద్ధం చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నం చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో పేదోడికి వైద్యం మరింత ఖరీదుగా మారిందన్నారు. ఆస్పత్రులకు చెల్లించాల్సిన రూ.2,500 కోట్ల పెండింగ్‌తో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెబాట పడుతున్నాయని పేర్కొన్నారు.

రేపు 'చలో మెడికల్ కాలేజ్'

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ పేరిట నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. విశాఖ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, అన్ని అనుబంధ విభాగాల నాయకులను కలిసి 19న పాడేరులోని మెడికల్ కళాశాల వద్ద శాంతియుతంగా నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు.

సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కనకల ఈశ్వరరావు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు జాడ శ్రావణ్‌కుమార్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కాగితాల రవికిరణ్, తాడి రవితేజ, ముప్పల సంతోష్ కుమార్, యువజన విభాగం నాయకులు బొట్ట రాజు, ప్రేమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన యాత్రలో.. అడ్డగోలుతనం

- అధికారిక కార్యక్రమాల్లో బంధువులు
- మేయర్ వత్తాసు, కళ్లు మూసుకున్న అధికారులు



రౌండప్‌లో.. ఓ కార్పొరేటర్ భర్త(బ్లూ షర్ట్) గంటా నూకరాజు, ఓ కార్పొరేటర్ దగ్గరి బంధువు పెంటపల్లి సత్యనారాయణ (వైట్ షర్ట్)



సర్కిల్లో.. ఓ కార్పొరేటర్ సోదరుడు ముక్కా కిషోర్, మరొకరు గంటా నూకరాజు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అధ్యయన యాత్రలు విహార యాత్రలుగా మారాయనే ఆరోపణలు సర్వసాధారణం. అందుకే వామపక్ష కార్పొరేటర్లు వీటిని చాలా వరకు వ్యతిరేకిస్తున్నారు. అయితే అడ్డగోలుగా జీవీఎంసీ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఈ అధ్యయన యాత్రలను మరింతగా దిగజార్చాయన్న ఆరోపణలు మూటగట్టుకుంటోంది. కార్పొరేటర్లు, అధికారుల కుటుంబ సభ్యులు ఇన్నాళ్లూ షికార్ల వరకే పరిమితమయ్యేవారు. ఈసారి ఓ అడుగు ముందుకేసి అక్కడి అధికారిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం గమనార్హం. దీన్ని నియంత్రించాల్సిన మేయర్, జీవీఎంసీ అధికారులు ఇందుకు వత్తాసుగా నిలవడమే విశేషం..!

అధ్యయనం పేరిట విహారం!

అధ్యయన యాత్రం కోసం మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు కార్పొరేటర్ల బృందం, వారి కుటుంబ సభ్యులు, జీవీఎంసీ అధికారులు మంగళవారం బయలుదేరిన విషయం తెలిసిందే. వీరంతా షెడ్యూల్ మేరకు బుధవారం జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించారు. వాస్తవానికి అధ్యయన యాత్ర మేయర్, కార్పొరేటర్లు, అధికారులకు మాత్రమే. వారి కుటుంబ సభ్యుల షికారుకు, వారు తీసుకున్న రూమ్ చార్జీల భారమూ జీవీఎంసీయే భరించడం రివాజుగా మారింది. ఈసారి మేయర్, కార్పొరేటర్ల బృందంతో వారి కుటుంబ సభ్యులు కూడా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం వివాదాస్పదంగా మారింది.

వీరి అవసరమేంటో..?

భీమిలి నియోజకవర్గానికి చెందిన ఓ కార్పొరేటర్ భర్త, ఉత్తర నియోజకవర్గానికి చెందిన మరో కార్పొరేటర్ సోదరుడు, దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఇంకో కార్పొరేటర్ దగ్గరి బంధువు.. ఇలా చాలా మంది నేరుగా జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించి, జైపూర్ నగర్ నిగమ్ మేయర్ సోనమ్ గుర్జార్‌ను కలుసుకున్నారు. అక్కడి కార్పొరేషన్‌లో నిర్వహించిన సమావేశంలో కూడా వీరంతా పాల్గొనడం గమనార్హం. అసలు ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు పాల్గొనవచ్చా? నేరుగా అక్కడి కార్పొరేషన్లోనే కార్పొరేటర్లతో కూర్చుంటే మేయర్ పీలా శ్రీనివాసరావు, అధికారులు ఏం చేస్తున్నట్లో..! అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ సొమ్ముతో షికార్లు చేయడమే కాకుండా.. ఇలా జీవీఎంసీ పరువు తీసేలా వ్యవహరించడం సరికాదని నగరవాసులు ఆక్షేపిస్తున్నారు.

జైపూర్ కార్పొరేషన్‌లో జీవీఎంసీ బృందం

అధ్యయన యాత్రలో భాగంగా జీవీఎంసీ బృందం జైపూర్ కార్పొరేషన్‌ను బుధవారం సందర్శించినట్లు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ల బృందం జైపూర్(రెడ్ సిటీని) సందర్శించి జైపూర్ అభివృద్ధి కార్యక్రమాలు, ఘన–ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై అధ్యయనం చేశారని, స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ప్రణాళికలు, సుస్థిర పట్టణాభివృద్ధిలో నూతన పద్ధతులను మేయర్, కార్పొరేటర్ల బృందం పరిశీలించారని తెలిపారు. ఈ సందర్భంగా జైపూర్ నగర నిగమ్ మేయర్ సోనమ్ గుర్జార్, ఇంజినీర్ ఓమన్ కార్గ్ జీవీఎంసీ మేయర్, కార్పొరేటర్ల బృందానికి స్వాగతం పలికి, జైపూర్ నగరాభివృద్ధితో పాటు సాధించిన ప్రగతి వివరించారు. జీవీఎంసీ తరఫున జ్ఞాపిక అందించినట్లు సెక్రటరీ తెలిపారు.

'ఇరిగేషన్'లో ఇన్‌చార్జ్‌ల పాలన

- ఉత్తరాంధ్రలో 4 ఎస్ఈ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లు
- ఈఈలు, డీఈఈలు కూడా సర్దుబాట్లే
- పదోన్నతుల్లోనూ జిల్లాకు అన్యాయం



మహారాణిపేట: ఉత్తరాంధ్రలో కీలకమైన జలవనరుల శాఖపై కూటమి సర్కార్ అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తోంది. సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉన్నాయి. ఉత్తరాంధ్రలో ఉన్న ఐదు ఎస్ఈ పోస్టుల్లో వంశధార ప్రాజెక్ట్ ఎస్ఈ ఒక్కరే రెగ్యులర్. ఎస్ఈలు రిటైర్ అయినా ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎక్కడో పనిచేస్తున్న వారికి అప్పగిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతోంది.

ధవళేశ్వరం నుంచి.. : విశాఖ ఎస్ఈ పోస్టులో ధవళేశ్వరం ప్రాజెక్ట్ ఎస్ఈని ఇన్‌చార్జ్‌గా నియమించారు. విస్తారంగా వర్షాలతో రిజర్వాయర్లు పొంగి ప్రవహిస్తున్న సమయంలో ఆయన ఇక్కడికి రాలేక, అక్కడే ఉండలేక తిప్పలు పడే పరిస్థితి. కీలకమైన విశాఖలో అనేక రిజర్వాయర్లలో నీరుచేరి గేట్లు ఎత్తడంలో అనుమతులు రాక ఏఈలు, డీఈఈ తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

ఈఈలు, డీఈఈలూ ఇన్‌చార్జిలే! : ఉమ్మడి ఉత్తరాంధ్రలో కీలకమైన నార్త్ కోస్టు సీఈ పోస్టు కూడా ఇన్‌చార్జితోనే నడుస్తోంది. ఉమ్మడి విశాఖలోని నాలుగు డివిజన్లలో మూడింట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(ఈఈ) కరవయ్యారు. దాదాపు అన్ని ఎస్ఈ, ఈఈ పోస్టులు ఇన్‌చార్జిలతోనే నడుస్తున్నాయి. ఇన్‌చార్జిలు రెండు/మూడు పడవల ప్రయాణం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో దాదాపు అన్ని డివిజన్లలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ), అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ)తోనే నెట్టుకొస్తున్నారు. ఈ పోస్టుల్లో కూడా చాలా వరకు ఇన్‌చార్జిలే ఉండటం గమనార్హం.

పదోన్నతులు, పోస్టింగుల్లోనూ అన్యాయం : జలవనరుల శాఖలో ఇటీవల ఇచ్చిన పదోన్నతులు, పోస్టింగుల్లో కూడా ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందని సిబ్బంది వాపోతున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్రలోని అన్ని ఎస్ఈలు, ఈఈ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నాయి. విశాఖ ఎస్ఈ పోస్టుకు ఇన్‌చార్జిగా ధవళేశ్వరం నుంచి వేశారంటే.. ఇక్కడి సిబ్బందిపై ప్రభుత్వానికి ఎంత చిన్నచూపు ఉందో.. తేటతెల్లమవుతోంది.

నేడు విశాఖలో సీజీఆర్ఎఫ్ క్యాంప్ కోర్టు

సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విశాఖపట్నం జోన్–1 పెదవాల్తేర్ సెక్షన్‌లో సీజీఆర్ఎఫ్ క్యాంప్ కోర్టును గురువారం నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సమావేశంలో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సదస్సులో సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజాబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థి



సాగర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి పి.సాగర్ టెన్నీకాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో కోనసీమ జిల్లా, మండపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ(పైసా)కు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సాగర్‌తో పాటు, శిక్షణ ఇచ్చిన పీడీ, పీఈటీలు సీఎల్ఎన్ ప్రసాద్, వి.సూర్యనారాయణలను ప్రిన్సిపాల్‌తోపాటు, వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి, ఉపాధ్యాయులు రాంబాబు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభం



స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయిస్తున్న సౌత్‌కోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథుర్

తాటిచెట్లపాలెం: సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ స్వచ్ఛతాహీ సేవా 2025 పక్షోత్సవాలను బుధవారం ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ 9వ విడతలో భాగంగా ఈస్ట్ పాయింట్ కాలనీలో ఈ కార్యక్రమం జరిగింది. జీఎం నాయకత్వంలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి వరకు 15 రోజులు దేశవ్యాప్తంగా రైల్వే అధికారులు, పౌరులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్‌కోస్ట్ రైల్వే ఓఎస్డీ బి. చంద్రశేఖర్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ



కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి. వాటిపై కనీస ధ్యాస లేదు. ప్రజా సమస్యల్ని, ప్రభుత్వంలో జరిగే అవినీతి, అక్రమాలను వెలికితీసి ప్రజా పక్షాన పోరాడే పత్రికలపై, జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు సరికాదు. పత్రికలపై, జర్నలిస్టులపై అక్రమ కేసులతో పత్రికాస్వేచ్ఛను హరిస్తామంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చూపించే సాక్షి పత్రికపై అక్రమ కేసులు నమోదుచేస్తున్నారు. ఒక ప్రజాప్రతినిధి మీడియా సమావేశం పెడితే అది వార్తగా ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం ఈ ప్రభుత్వానికి మంచిది కాదు.

– మళ్ల విజయప్రసాద్, మాజీ ఎమ్మెల్యే



అమల్లో.. రెడ్ బుక్ రాజ్యాంగం



ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయ భారత రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అనుసరించడం లేదు. ప్రజా సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్న ఈ ప్రభుత్వ వైఫల్యాలను వెలికితీసే సాక్షి పత్రిక, టీవీ జర్నలిస్టులపై, సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసే కుట్రలకు పాల్పడుతోంది. ఒక రాజకీయ నాయకుడి ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే కేసు ఎలా నమోదు చేస్తారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రెస్‌మీట్‌ల ద్వారా వెల్లడించిన అంశాలను వార్తగా మలిచే హక్కు జర్నలిస్టులకు ఉంటుంది. అంతమాత్రాన జర్నలిస్టులకు, ఆ పత్రికలకు వాటిని ఆపాదించి కేసులు వేయడం సరికాదు.

– మొల్లి అప్పారావు, విశాఖ తూర్పు సమన్వయకర్త

స్మార్ట్ పరేషన్

- స్మార్ట్ రేషన్ కార్డుల కోసం లబ్ధిదారుల ప్రదక్షిణలు
- ఇప్పటికీ లబ్ధిదారులకు అందని కార్డులు 91,336
- తమ వద్ద లేవని తప్పించుకుంటున్న రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నా పేరు రజిత. మేము కంచరపాలెంలో ఉంటున్నాం. మా స్మార్ట్ రేషన్ కార్డు ఎక్కడ ఇస్తున్నారో తెలియక సచివాలయాలకు వెళ్లి చూశాం. ఎవరిని అడిగినా సరైన సమాధానం లేదు. తీరా మా ప్రాంతానికి సంబంధం లేని ఒక వీఆర్‌వోను సంప్రదిస్తే సమీపంలోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడికి వెళ్లి అడిగినా సరైన సమాధానం లేదు. తీరా రేషన్ డిపోలో నా కార్డు ఉంది.

నా పేరు సత్యవతి. మాది అల్లిపురం. ఇప్పటి వరకు మేము ఇక్కడే రేషన్ తీసుకుంటున్నాం. స్మార్టు కార్డు గురించి మా సచివాలయంలో వీఆర్‌వోని అడిగితే ఇక్కడికి రాలేదన్నారు. ఇంతకు ముందు ఎక్కడ ఉండేవారో అక్కడికి వెళ్లి తీసుకోండని చెప్పారు. అక్కడికి వెళ్తే మా కార్డు మరో సచివాలయంలో ఉందన్నారు. అక్కడ కూడా కార్డు దొరకలేదు. ఇలా వారం రోజులు తిరిగినా ఇప్పటికీ దొరకలేదు.

ఇది రజిత, సత్యవతిల సమస్యే కాదు. ఇలా ఎందరో స్మార్టు కార్డుల కోసం సచివాలయం, రేషన్ డిపోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



మహారాణిపేట : రేషన్ లబ్ధిదారులు గత కొన్ని రోజుల నుంచి కూటమి ప్రభుత్వం ఇస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోవడానికి రేషన్ డిపోలకు వెళ్తున్నారు. తమ వద్దకు ఇంకా రాలేదు సచివాలయానికి వెళ్లాలని రేషన్ డీలర్లు సూచిస్తున్నారు. అక్కడికి వెళ్తే కొద్ది సేపు వెతికి కార్డు ఇక్కడ లేదు రేషన్ డిపోకు వెళ్లాలని సిబ్బంది చెబుతున్నారు. ఇలా రేషన్ డిపో, సచివాలయాల చుట్టూ లబ్ధిదారులు చక్కర్లు కొడుతున్నారు. కాని ఎక్కడా స్మార్ట్ కార్డు జాడ దొరకడం లేదు. సెప్టెంబర్ సరుకులు తీసుకోవడానికి ఈనెల 15వ తేదీ గడువుగా నిర్ణయించారు. ఆ తర్వాత రేషన్ షాపులన్నీ మూతపడ్డాయి. మళ్లీ 26వ తేదీ నుంచి రేషన్ డిపోలు తెరిచి ఉంటాయి. అప్పటి వరకు ఎవరి రేషన్ కార్డులు తీసుకోవడానికీ వీలు లేకుండా పోయింది. 26వ తేదీ నుంచి వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ ఇవ్వనున్నారు. అయితే స్మార్ట్ కార్డు ఉంటే గాని రేషన్ సరుకులు ఇవ్వమని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రేషన్ డీలర్లతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఎస్‌వో భాస్కరరావు సమావేశం ఏర్పాటు చేసి కార్డుల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. అయినా డీలర్ల స్పందన అంతంత మాత్రంగానే ఉంది.

పంపిణీకి నోచుకోని 91,336 కార్డులు

కూటమి సర్కార్ గత నెల 26న స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 26 నుంచి 31వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి కార్డులు పంపిణీ చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి అన్ని రేషన్ డిపోల్లో వేలిముద్రలు వేసి కార్డులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కోసం డీఎస్‌వో ఆధ్వర్యంలో అసిస్టెంట్ సివిల్ సప్లయి అధికారుల పర్యవేక్షణలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం, చౌకధరల దుకాణాల వారీగా ఏర్పాటు చేసినట్టు పౌరసరఫరాల శాఖ తెలిపింది. 5,17,155 స్మార్ట్ రేషన్ కార్డులు జిల్లాకు చేరుకున్నాయి. ఈ కార్డుల పంపిణీ కోసం పలు ఏర్పాట్లు చేసినట్టు డీఎస్‌వో వి.భాస్కరరావు తెలిపారు. సచివాలయాల సిబ్బంది ద్వారా 1,92,008, డీలర్ల ద్వారా 2,33,811 కార్డుల పంపిణీ చేశారు. మొత్తంగా ఇప్పటివరకు 4,25,819 పంపిణీ చేయగా ఇంకా 91,336 కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని డీఎస్‌వో పేర్కొన్నారు. స్మార్ట్ కార్డుల కోసం రేషన్ డిపోలకు వెళ్తే సచివాలయానికని.. అక్కడకు వెళ్తే రేషన్ డిపోలకు వెళ్లాలని తిప్పుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

కీలకంగా స్మార్ట్ కార్డు

నిత్యావసర వస్తువులతో పాటు పలు ప్రభుత్వ పథకాలకు ఈ స్మార్టు కార్డు అవసరం ఉంది. వివరాలు సక్రమంగా లేకపోతే కొన్ని సమయాల్లో అధికారులు తిరస్కరించే అవకాశం ఉంటుంది. కొత్తగా స్మార్ట్ కార్డులు మంజూరు చేసే సమయంలో లబ్ధిదారుని వివరాలు, అడ్రస్ సక్రమంగా ముద్రించాల్సిన బాధ్యత సర్కార్ మీద ఉంది. అలా జరగనందున కొన్ని సమయాల్లో ప్రభుత్వ పథకాలకు దూరమవుతామనే ఆందోళన ప్రజల్లో ఉంది. కార్డుల్లో పిల్లల పేర్లు, వయసు తేడా, చిరునామా తదితర అంశాలు సక్రమంగా ఉండాలని కార్డుదారులు కోరుతున్నారు. అయితే పూర్తిగా పంపిణీ జరగకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

ప్రేమ, పెళ్లి పేరిట మోసం చేసిన కేసులో ముగ్గురి అరెస్ట్

కూర్మన్నపాలెం: ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి, శారీరకంగా వాడుకుని గర్భస్రావం చేయించిన వ్యక్తిని, అందుకు సహకరించిన మరో ఇద్దరిని దువ్వాడ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ కె.మల్లేశ్వరరావు అందించిన వివరాల మేరకు.. అగనంపూడి కొత్తూరు రామాలయం వద్ద నివాసముంటున్న యువతిని పరవాడ మండలం ఈ మత్రిపాలేనికి చెందిన దుల్లా కిషోర్(21) ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా అనుభవించాడు. ఆమె గర్భం దాల్చడంతో ఈ నెల 16న గర్భస్రావం చేయించాడు. కిషోర్‌కు పరవాడ మండలం వినాయకనగర్‌కు చెందిన గండి సతీష్(28), గండి వెంకటేష్ (25) సహకరించారు. గర్భస్రావం చేయించడంతో మోసపోయినట్లు గ్రహించిన యువతి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ నిమిత్తం కిషోర్‌ను స్టేషన్‌కు పిలిపించారు. దీన్ని తట్టుకోలేని సతీష్, వెంకటేష్‌లు మద్యం సేవించి బుధవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని యువతిని బెదిరించారని సీఐ తెలిపారు. ఆ సమయంలో పోలీస్ సిబ్బంది అడ్డుకోగా వారిపై కూడా తిరగబడి, నానా దుర్భాషలాడినట్టు పేర్కొన్నారు. దీంతో కిషోర్‌తోపాటు వారిద్దరిపైనా మరోకేసు నమోదు చేసి, ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

బీచ్‌రోడ్డు : మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సైతూరు పేట గ్రామానికి చెందిన విద్యార్థిని (17) ఓ ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్‌లో రెండో సంవత్సరం చదువుతుంది. ఆమె ఉపేంద్ర అనే వ్యక్తితో కలిసి రేసపువానిపాలెంలో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ రావడంతో ఉపేంద్ర ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతడు వెళ్లిన కొద్దిసేపటికే ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.150
స్కిన్	: రూ.270
స్కిన్‌లెస్	: రూ.280

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	555.00
విజయనగరం	559.00
శ్రీకాకుళం	559.00

ఎయిర్‌పోర్టులో ఘనంగా యాత్రి సేవా దివాస్

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కంటి వైద్యం, రక్తదాన శిబిరాలకు స్పందన

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో గురువారం నిర్వహించిన యాత్రి సేవా దివాస్ ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. టెర్మినల్ భవనంలో నృత్యభారతి డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ, ఫోక్ డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. ఎయిర్ పోర్టు ప్రాంగణంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు పీవీఎన్ మాధవ్, గండి బాబ్జి, కె.ప్రభాకర్, కూన రవికుమార్ తదితరులు మొక్కలు నాటారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిపిన చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు.



గోపాలపట్నం హైస్కూల్‌లో క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఏఏఐ సిబ్బంది, ఉపాధ్యాయులు

వైద్య శిబిరాలకు విశేష స్పందన

ఎయిర్‌పోర్టు ఆవరణలో వాసన్ ఐ కేర్ సహకారంతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు. వైజాగ్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఉద్యోగులు, ప్రయాణికులు, సిబ్బంది పాల్గొన్నారు. విమానాశ్రయ పరిశుభ్రత, సేవా ప్రమాణాలపై ప్రయాణికులతో మాట్లాడి, అభిప్రాయాలు తీసుకున్నారు.



విమానాశ్రయంలో డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉద్యోగావకాశాలపై అవగాహన

విమానాశ్రయాల్లో వివిధ రకాల ఉద్యోగావకాశాలు, అభ్యసించాల్సిన కోర్సులపై పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ యాత్రి సేవా దివాస్ కార్యక్రమం ప్రయాణికులకు ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. విజయవంతం చేసిన ఉద్యోగులను, సిబ్బందిని అభినందించారు.

నేల పరీక్షలను అడ్డుకున్న దళిత రైతులు

తగరపువలస : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ సర్వే నంబర్ 1లో 35/71/72/74/75లో తమకు చెందిన డి పట్టా భూములను కూటమి ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటుందని దళిత రైతులు వాపోయారు. బుధవారం నేల పరీక్షలకు యంత్రాలతో వచ్చిన వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రభుత్వం 51 మంది దళితులతో పాటు బీసీ రైతులకు 2 ఎకరాల చొప్పున భూమి కేటాయించిందన్నారు. అప్పటి నుంచి ఈ భూములతో పాటు చుట్టుపక్కల ఉన్న బంజరు భూముల్లో జీడి, మామిడి, అరటి వంటి తోట పంటలు సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామన్నారు. వ్యవసాయానికి అనువుగా ప్రభుత్వాలు బోరుబావులు, విద్యుత్ మోటార్లు, సోలార్ కనెక్షన్లు కూడా ఇచ్చాయన్నారు. గతంలో భీమిలి ఆర్డీవో, ఆనందపురం తహసీల్దార్ పంచాయతీకి వచ్చి గ్రామసభ నిర్వహించారన్నారు. రైతుల సాగులో ఉన్న భూములు, సర్వే నంబర్లు వేర్వేరుగా ఉన్నందున సరి చేసి ఇస్తామని నమ్మబలికారన్నారు. తరువాత ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటామనగా దళిత వార్డు సభ్యులు పైల బంగారమ్మ, కోండ్రు శంకర్ తదితరులు వ్యతిరేకించారన్నారు. అంతకు ముందే ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. వారం రోజుల క్రితం వచ్చిన అధికారులు 350 ఎకరాల వరకు గూగుల్ తదితర సంస్థలకు తమకు చెందిన డీ పట్టా భూములు, బంజరు భూములను ఇవ్వనున్నట్టు తెలిపారన్నారు. అందులో భాగంగా బుధవారం నేల పరీక్షలకు వచ్చిన వారిని అడ్డుకున్నామన్నారు. తమకు ఈ భూములు పోతే భవిష్యత్తు ఉండదని ఉద్యోగాలు, నష్టపరిహారం తగినంతగా ఇస్తే తప్ప భూములు వదులుకోమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశారు. ఈ సందర్భంగా తాత్కాలికంగా నేల పరీక్షలు వాయిదా వేసుకుని అధికారులు వెళ్లిపోయారు.



తర్లువాడలో నేల పరీక్షలు జరపకుండా అడ్డుకుంటున్న దళిత రైతులు

అనుమానంతో భార్యను చంపిన భర్త



లక్ష్మి మృతదేహం

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం శివారు జాలారిపేటకు చెందిన ఒలిశెట్టి కోదండ ఆయన భార్య లక్ష్మి(45)పై అనుమానం పెంచుకుని, మద్యం మత్తులో బుధవారం ఉదయం దారుణంగా కొట్టి, చాకుతో పొడిచి హత్య చేసినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. హత్యకు సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒలిశెట్టి కోదండ ఆముదాలవలస ప్రాంతానికి చెందిన హతురాలు లక్ష్మిని మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని, జాలారిపేటలో చేపల వేట సాగిస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం వేటాడిన చేపల్ని విక్రయించగా వచ్చిన సొమ్ముతో రెండు రోజులుగా మద్యం సేవిస్తున్నాడు. కోదండతో పాటు భార్య లక్ష్మి కూడా మద్యం సేవిస్తుంటుందని స్థానికులు చెప్తున్నారు. భార్యపై అనుమానం కూడా ఉండేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మద్యం సేవించిన కోదండ.. భార్య లక్ష్మితో తన ఇంటి ముందు గొడవపడ్డాడు. కర్రతో కొట్టుకుంటూ ఇంటిలోపలికి తీసుకెళ్లి చాకుతో పొడవడంతో లక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. నిందితుడు కోదండకు ఆమె మూడవ భార్య. ఈయన ప్రవర్తన బాగాలేక మొదటి భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. అనంతరం పూడిమడకకు చెందిన ఒకామెను వివాహం చేసుకోగా ఆమె పట్ల కూడా అనుచితంగా ప్రవర్తించడంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తరువాత ఆముదాలవలస ప్రాంతానికి చెందిన హతురాలు లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. హత్య విషయాన్ని తెలుసుకున్న సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు. హతురాలు లక్ష్మికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. హత్యకు పాల్పడిన కోదండను అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

ప్రాణాలకు తెగించైనా బల్క్ డ్రగ్‌ను అడ్డుకుంటాం



మండుటెండలో గొడుగు నీడలో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

- మండుటెండలో 4వ రోజు కొనసాగిన నిరాహార దీక్ష
- సహనాన్ని పరీక్షించవద్దని మత్స్యకారుల హెచ్చరిక
- మద్దతు తెలిపిన వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు

నక్కపల్లి: 'మా సహనాన్ని పరీక్షించొద్దు... శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో అణగతొక్కాలని ప్రయత్నిస్తోంది... ప్రాణాలకు తెగించైనా బల్క్‌డ్రగ్‌ను అడ్డుకుంటాం.. ఓట్లేసి గెలిపిస్తే హోంమంత్రి అనిత తమపట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారను కోలేదు' అంటూ రాజయ్యపేట మత్స్యకారులు ఆగ్రహంతో రగిలిపోయారు. బల్క్ డ్రగ్‌పార్క్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరాహారదీక్ష నాల్గో రోజు బుధవారం కొనసాగింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో టెంట్లు వేసి, దీక్ష కొనసాగించేందుకు సిద్ధపడగా సీఐ కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీక్షకు పర్మిషన్ లేదని, టెంట్లు వేయడానికి వీల్లేదన్నారు. దీంతో గంగపుత్రులు గొడుగుల నీడలో దీక్షను కొనసాగించారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని వారు ఈ సందర్భంగా చెప్పారు. **ఇప్పటికే పదుల సంఖ్యలో మత్స్యకారులపై కేసులు నమోదు చేశారు. అరెస్టులవడానికి, జైలుకెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామంటూ మత్స్యకార మహిళలు** నినాదాలు చేశారు. వీరి ఆందోళనకు సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు కె.లోకనాథం, జాతీయమత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్, రైతు సంఘనాయకుడు సత్యనారాయణ తదితరులు మద్దతు తెలిపారు, ఎండలో మత్స్యకారులతో కలసి నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు

ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ మత్స్యకారులను కూటమిప్రభుత్వం దేశద్రోహులగా చిత్రీకరిస్తోందని, శాంతియుతంగా నిరాహరదీక్ష చేస్తున్న వారిపై ఆంక్షలు విధిస్తోందని చెప్పారు. నాలుగు రోజులుగా రాజయ్యపేటలో పోలీసుల రాజ్యం నడుస్తోందన్నారు. తనను ఆదరించిన మత్స్యకారులను ఆదుకోకపోగా పోలీసుల సాయంతో ఉద్యమంపై హోంమంత్రి అనిత ఉక్కుపాదం మోపుతున్నారని ఆరోపించారు. బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం నుంచి అసెంబ్లీసమావేశాలు ప్రారంభ కానున్నాయని, ఈ సమావేశాల్లో రాజయ్యపేటలో జరుగుతున్న ఆందోళనల గురించి ప్రస్తావించి బల్క్‌డ్రగ్‌పార్క్ రద్దుచేసే విధంగా బిల్లు పాస్‌చేయాలని కోరారు. దేశంలో మూడు చోట్ల..గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ బల్క్‌డ్రగ్‌పార్క్‌లను పెడుతున్నామని చెబుతున్నప్పటికీ అది నిజం కాదని, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే పెడుతున్నారన్నారు. ఈ పార్క్ ఏర్పాటయితే పదుల సంఖ్యలో ప్రమాదకర రసాయన పరిశ్రమలు వస్తాయని, ఈ ప్రాంత మంతా శ్మశానంగా మారుతుందని చెప్పారు. గంగపుత్రులు చేసే పోరాటానికి మద్దతు ఇస్తున్నామని, జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. జాతీయమత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు మాట్లాడుతూ ఇది ఒక్క రాజయ్యపేట మత్స్యకారుల సమస్య కాదని, తూర్పుతీరంలో ఉన్న అందరి సమస్య అని చెప్పారు. ఎండలో మహిళలు ఇబ్బంది పడుతుంటే టెంట్లు వేయకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. మత్స్యకారులు తలచుకుంటే టెంట్లు వేయడం పెద్ద పనికాదని చెప్పారు. తమ సహనాన్ని పరీక్షించవద్దన్నారు. రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులందరిని ఏకం చేస్తామని, త్వరలోనే ఇతరప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులందరినీ రాజయ్యపేట తీసుకు వచ్చి తమ సత్తా ఏంటో చూపిస్తామని తెలిపారు. జాతీయమత్స్యకార సంఘ అధ్యక్షుడు, ఇతర మత్స్యకార పెద్దలను కలసి ఇక్కడి సమస్య వివరిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఉపాధ్యక్షుడు నాగేశు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ మాట్లాడుతూ మత్స్యకారుల పట్ల పోలీసుల వైఖరి సరికాదన్నారు. ఉద్యమానికి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో మత్స్యకార నాయకులు సోమేష్, పిక్కి తాతీలు, పిక్కి కోదండరావు, మైలపల్లిసూరిబాబు, నారాయణరావు,కాశీరావు,మహేష్, రాజశేఖర్, యజ్జల అప్పలరాజు, కోడకాశీరావు,పైడితల్లి,నూకరాజు, మహిళలు పాల్గొన్నారు.